# నమస్తే తెలంగాణ

# సిద్దిపేట

I | హైదరాబాద్, శుక్రవారం 14 జూన్ 2024 | SIDDIPET


## సారీ.. నో అడ్మిషన్స్

### సిద్దిపేటలోని ఇంద్రానగర్ జడ్పీహెచ్ఎస్‌లో పరిస్థితి

సిద్దిపేట, జూన్ 13: పాఠశాలల్లో బడిపిల్లలను చేర్పించడానికి ఉపాధ్యాయులు నానా తంటాలు పడుతుంటారు. పిల్లలను తమ పాఠశాలల్లో చేర్పించడానికి బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కానీ సిద్దిపేటలోని ఇంద్రానగర్ జడ్పీహెచ్ఎస్ ఇందుకు భిన్నంగా ఉంటుంది. సార్ మీ పాఠశాలలో అడ్మిషన్ కావాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను అడుగుతున్న మాట ఇక్కడ వినబడుతుంది. కార్పొరేట్ స్కూల్లో అడ్మిషన్ కోసం ఇలాంటి పరిస్థితి ఉంటుంది. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఇంద్రానగర్ జడ్పీహెచ్ఎస్‌ను దత్తత తీసుకున్న తర్వాత ఈ పాఠశాల రూపురేఖలే మారిపోయాయి. ఈ విద్యా సంవత్సరంలోనూ అడ్మిషన్లకు డిమాండ్ ఏర్పడింది. 6నుంచి పదోతరగతి వరకు తరగతులు ఉండగా, 7, 8, 9, 10వ తరగతిలో అడ్మిషన్లు ఫుల్ అయ్యాయి. పాఠశాలలో 6 తరగతిలో 200 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఇందుకోసం 600 దరఖాస్తులు వచ్చాయి. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థుల దరఖాస్తులను స్వీకరించేందుకు వారికి గురువారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ పాఠశాలలో 1200 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. దీనికితోడు ఇప్పు కార్యక్రమంతో విద్యార్థులకు ఇంగ్లిష్‌తో పాటు ఫ్రెంచ్, స్పానిష్ భాషలను నేర్పిస్తుండడం ఈ పాఠశాల ప్రత్యేకత. ఇప్పటికే అడ్మిషన్ల కోసం పెద్దసంఖ్యలో దరఖాస్తులు రావడంతో ఉపాధ్యాయులు పాఠశాల ఎదుట నో అడ్మిషన్ బోర్డును ఏర్పాటు చేశారు.




పాఠశాల గేటుకు ఏర్పాటు చేసిన నో అడ్మిషన్ బోర్డు



న్యాల్‌కల్: నాణ్యత లేకపోవడంతో ధ్వంసమై గుంతలు పడిన రోడ్డును చూపుతున్న ప్రజలు

## నాసిరకం పనులతో రోడ్లు ధ్వంసం

**కొరవడిన అధికారుల పర్యవేక్షణ**

- ఆదిలోనే దెబ్బతింటున్న ఆర్అండ్‌బీ రోడ్లు
- ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు

న్యాల్‌కల్, జూన్ 13: కోట్లాది రూపాయలతో నిర్మించిన రోడ్డు మరమ్మతు పనులు ఇవేనా అంటూ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా చేపట్టిన రోడ్డు మరమ్మతు పనులు ఆదిలోనే ధ్వంసమవుతున్నాయి. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమ సమీపం నుంచి రాంతీర్థం, గుంజోట్టి, వడ్డి, శంశోల్లాపూర్ మీదుగా కర్ణాటక సరిహద్దు ప్రాంతానికి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డ మార్గంలో ఆయా గ్రామాలతో పాటు కర్ణాటక ప్రాంతాలకు చెందిన ప్రజల రాకపోకలు అధికంగా ఉంటాయి. ఈ రోడ్డు మార్గానికి మరమ్మతులు చేసి బాగు చేయాలని ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులకు మొరపెట్టుకోగా, జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపడంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి స్టేట్ ఫండ్ కింద మరమ్మతులు చేపట్టడానికి రూ.1.43 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ మార్గంలోని గుంజోట్టి-వడ్డి గ్రామాల శివారుతోపాటు దెబ్బతిన్న పలుచోట్ల ఉన్న 3.6 కిలోమీటర్ల దూరం రోడ్డుకు మరమ్మతులు పనులు చేపట్టారు. రోడ్డు నిర్మాణ దశలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో కోట్లాది రూపాయలు ఖర్చుచేసిన రోడ్డు కొద్దిరోజుల్లోనే పాడైపోయింది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు రోడ్ల పనులను పరిశీలిస్తే కాంట్రాక్టర్లు ఎంతటి శ్రద్ధ కనబరిచారో వెల్లడవుతుందన్నారు. రోడ్డు నిర్మాణంలో అధికారులు పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా చేపట్టడంతో రోడ్లు దెబ్బతింటున్నాయన్నారు. దీనికి తోడు ఈ మార్గంలో 20 టన్నుల లోడ్‌తో వెళ్లాల్సిన ఇసుక లారీలు 50-60 టన్నులతో వెళ్లడంతో రోడ్డు దెబ్బతింటున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని రోడ్లను బాగు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని సంబంధిత ఆర్అండ్‌బీ ఏఈ సంధ్య దృష్టికి తీసుకెళ్లాగా ఆయా గ్రామాల మధ్య నిర్మించిన ఆర్అండ్‌బీ రోడ్డును పరిశీలించి బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కెపాసిటీకి మించి అధిక లోడ్‌తో ఇసుక లారీలు వెళ్తుండడంతో రోడ్లు దెబ్బతింటున్నాయని, వాటిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఆయా గ్రామాల మీదుగా రాకపోకలు సాగించే ప్రజలు, వాహన చోదకులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామని పేర్కొన్నారు.

## హత్యాయత్నం కేసులో నిందితుల రిమాండ్

సిద్దిపేట టౌన్, జూన్ 13: హత్యాయత్నం కేసులో నిందితులను గురువారం రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు సిద్దిపేట ఏసీపీ మధు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని రాఘవేంద్రనగర్‌కు చెందిన గూడూరి అనిత సర్వే నంబర్ 1999లో ప్లాట్ కొనుగులు చేసి మున్సిపల్ అనుమతులతో ఇల్లు కడుతుండగా పత్రి శ్రీనివాస్, దూది శ్రీకాంత్‌రెడ్డి భూమి తమదంటూ తప్పుడు కాగితాలు చూపి ఇంటి నిర్మాణం జరగకుండా ఆపారు. బాధితురాలు హైకోర్టుకెళ్లి అనుకూలంగా ఆర్డర్ తెచ్చుకొని పనులు చేస్తుండగా శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి చంపుతామని బెదిరించడంతో పాటు ఏప్రిల్ 19న జేసీబీతో నిర్మాణంలో ఉన్న ఇంటిని కూల్చివేశారు. సెంట్రింగ్ సామగ్రిని ధ్వంసం చేశారు. కారును, ద్విచక్ర వాహనాన్ని డ్యామేజ్ చేసి గూడూరి అనితకు మద్దతుగా నిలిసిన సతీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలపై దాడి చేసి పారిపోయారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు దూది శ్రీకాంత్‌రెడ్డి, పత్రి శ్రీనివాస్, పాతూరి శ్రీనివాస్‌రెడ్డి, శివరాత్రి నగేశ్, చేర్యాల అభిషేక్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. అంతకుముందు పర్షరాములు, ఆనంద్, యాదగిరిలను పట్టుకున్నామని చెప్పారు. పత్రి నాగరాజు, కొంపెల్లి నాగరాజు, బోదాస్ కనకరాజు పరారీలో ఉన్నారని, త్వరతో వారిని పట్టుకుంటామని పోలీసులు చెప్పారు.



మునిపల్లి-బుధేరా రోడ్డు వెంట ఎండిపోయిన హరితహారం మొక్కలు

## హరితహారం మొక్కలకు రక్షణేది?

**అధికారులూ.. జర నిద్ర లేవండి..**

- మునిపల్లి-బుధేరా రోడ్డుపై మొక్కలు ఎండిపోతున్నా పట్టించుకోరా..
- మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలంటున్న ప్రయాణికులు

మునిపల్లి, జూన్ 13: అధికారులు మొద్దు నిద్రలో ఉండడంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాటిన హరితహారం మొక్కలకు రక్షణ లేకుండా పోయింది. నాడు ప్రతిష్టాత్మకంగా నాటిన మొక్కలను అధికారులు గాలికి వదిలేయడంతో నేడు అవి ఎండిపోయాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అధికారులు నిద్రమత్తులో వాటిని పట్టించుకోవడం లేదు. నిత్యం మునిపల్లి-బుధేరా రోడ్డుపై అధికారులు విధులకు వెళ్తుంటారు. కానీ వారికి రోడ్డు పక్కన ఎండిపోతున్న హరితహారం మొక్కలు మాత్రం కనిపించడం లేదని ప్రయాణికులు మండిపడుతున్నారు. మొక్కల సంరక్షణపై నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



మునిపల్లి-బుధేరా రోడ్డు వెంట ఎండిపోయిన హరితహారం మొక్కలు

# బార్లను తలపిస్తున్న బెల్ట్‌షాపులు

### గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం.. సిద్దిపేట జిల్లావ్యాప్తంగా ఇదేతంతు

- వేకువజాము నుంచి అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలు
- దందా కొనసాగుతున్నా పట్టని ఎక్సైజ్ అధికారులు
- నెలవారీగా అమ్యామ్యాలతో పట్టించుకోని వైనం..?
- షాపుల వారీగా రైడింగ్ టీమ్స్ ఏర్పాటు
- బెల్ట్‌షాపులు మూసివేయించాలని మహిళల నిరసన



చేర్యాలలో ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి వచ్చిన చిట్యాల గ్రామ మహిళలు (ఫైల్)

చేర్యాల, జూన్ 13 : గ్రామాల్లో బెల్ట్‌షాపులు బార్లను తలపిస్తున్నాయి. మేం అధికారంలోకి వస్తే బెల్ట్‌షాపులు లేకుండా చేస్తాం.. నాణ్యమైన మద్యం విక్రయాలు జరిపిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చింది. తీరా అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ సర్కారు ఒట్టు తీసి గట్టున పెట్టింది. మద్యం విక్రయాలు మరింత పెంచేందుకు కొత్తగా డిస్టలరీలకు అనుమతి ఇస్తూ తన అసలైన స్వరూపాన్ని బయటపెట్టింది. జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్లు, దుబ్బాక, చేర్యాల మున్సిపాలిటీలతోపాటు అన్ని గ్రామాల్లో బెల్ట్‌షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఆరు నెలలుగా రాష్ట్రంలో ఎన్నికలు ఉండడంతో మద్యం విక్రయాలు పెరగడంతోపాటు గ్రామాల్లో బెల్ట్‌షాపులు సంఖ్య భారీగా పెరిగింది. ఒక్కో గ్రామాల్లో 5 నుంచి 10 బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న బెల్ట్‌షాపుల నుంచి నెలవారీగా వాటిని నియంత్రించాల్సిన సంబంధిత శాఖ అధికారులు మామూళ్ల మత్తుతో తూగుతూ పట్టించుకోవడం లేదని గ్రామాల్లో విమర్శలు వినిపిస్తున్నాయి.పైగా గ్రామాల్లోని బెల్ట్‌షాపులన్నీ వైన్‌షాపుల నిర్వాహకులు, ఎక్సైజ్‌శాఖ అధికారుల కనుసన్నల్లోనే కొనసాగుతున్నాయని అన్ని గ్రామాల్లో మహిళలు ఆరోపిస్తున్నారు. బెల్ట్‌షాపులను తొలిగించాలని ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్నారు.

**మబ్బుల మొదలై.. అర్ధరాత్రి వరకు..**

పట్టణాలు, మండల కేంద్రాల్లో ప్రభుత్వ అనుమతితో కొనసాగుతున్న మద్యం షాపులు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు కొనసాగుతున్నాయి. గాంధీ జయంతి, జెండా పండుగ, ఎన్నికలు, ఎన్నికల ఫలితాల రోజున మూసి ఉంటాయి. కానీ బెల్ట్‌షాపులు మాత్రం ఏ రోజూ అనే తేడా లేకుండా 24 గంటలూ కొనసాగుతున్నాయి. గ్రామాల్లో వేకువజామునే నిద్రలేచే అలవాటు ఉన్న వ్యక్తులు నేరుగా బెల్ట్‌షాపుకెళ్లి 90ఎంఎల్ వేసుకుని తన రోజువారీ పనులు ప్రారంభిస్తారు. వ్యవసాయ బావుల వద్దకు, పనులకు వెళ్లే సమయంలో నైంటీ, వచ్చేటప్పుడు మరో నైంటీ, రాత్రి పూట ఓ క్వాటర్ అర్ధరాత్రి వరకు తాగుతున్నారు. బెల్ట్‌షాపులు నిర్వాహకులు ఎలాంటి సమయపాలన లేకుండా మందుబాబులకు మద్యం విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు.

**మండల పరిధిలోనే కొనుగోలు చేయాలి**

అసలు బెల్ట్‌షాపులకు ఎలాంటి అనుమతి లేదు..ఇల్లీగల్‌గా కొనసాగుతున్న దందాపై మండల కేంద్రం, పట్టణాల్లో ఉన్న వైన్స్ వ్యాపారులు నిబంధనలు విధిస్తున్నారు. జిల్లాలోని ఒక మండల పరిధిలోకి వచ్చే గ్రామాల్లో కొనసాగుతున్న బెల్ట్‌షాపులు అదే మండలంలో ఉన్న వైన్ షాపుల్లో మద్యం కొనుగోలు చేసి గ్రామాల్లో విక్రయించుకోవాలి. దీనికి భిన్నంగా ఎవరైనా బెల్ట్‌షాపు నిర్వాహకుడు మరో మండలంలో మద్యం కొనుగోలు చేసి విక్రయిస్తే ఇక్కడి వైన్స్‌షాపుల నిర్వాహకులు వారిని ఎక్సైజ్ పోలీసులకు పట్టించి కేసులు నమోదు చేయిస్తున్నారు. రోజువారీగా బెల్ట్‌షాపులు కొనసాగుతున్న తీరు, వారు ఎక్కడి మందు తీసుకొచ్చి విక్రయాలు జరుపుతున్నారో తెలుసుకునేందుకు వైన్‌షాపుల వారీగా రైడింగ్ టీం ఏర్పాటు చేసి వ్యాపారం కొనసాగిస్తున్నారు. గ్రామాల్లోని బెల్ట్‌షాపులన్నీ వైన్ షాపుల నిర్వాహకులు, ఎక్సైజ్‌శాఖ అధికారుల కనుసన్నల్లోనే కొనసాగుతాయి.

### బెల్ట్‌షాపులు తొలిగించాలంటున్న మహిళలు

బెల్ట్‌షాపులు తొలిగించాలని కోరుతూ చేర్యాల మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన మహిళలు ఇటీవల పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆశ్రయించారంటే సిద్దిపేట జిల్లాలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలి. గ్రామాల్లో అడ్డగోలుగా షాపులు ఏర్పాటు చేసి యథేచ్ఛగా మద్యం విక్రయిస్తున్నారని, ఎప్పుడుపడితే అప్పుడు తాగొచ్చి ఇంట్లో గొడవలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల గ్రామాల్లో ఓ వ్యక్తి తాగొచ్చి గొడవపడి భార్యపై పెట్రోల్ పోశాడు. మరోవ్యక్తి మందు ఎక్కువై చచ్చిపోతానంటూ పురుగుల మందు తాగాడని తెలిపారు.

### అధిక ధరలకు విక్రయాలు

పట్టణాలు, మండలకేంద్రాల్లో ఉన్న మద్యం షాపుల్లో ప్రభుత్వ నిర్ణయించిన ధరలకు విక్రయాలు జరుగుతుండగా, బెల్ట్‌షాపుల నిర్వాహకులు మాత్రం గ్రామాల్లో అధిక ధరలకు విక్రయించి మందుబాబుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. పండుగ నుంచి చావు వరకు గ్రామాల్లో ఏ కార్యక్రమం జరిగినా మద్యం సేవిస్తుండడంతో వారిని అసరగా చేసుకుని బెల్ట్‌షాపుల నిర్వాహకులు క్వార్టర్‌కు రూ.20, ఆఫ్ బాటిల్‌కు రూ.40, ఫుల్ బాటిల్‌కు రూ.80 వరకు అధికంగా వసూలు చేస్తున్నారు. బార్లలో పోసినట్లు బెల్ట్‌షాపుల్లో సైతం లూజ్ మద్యం విక్రయిస్తున్నారు.



# రైతుల పొలం బాట

### సంగారెడ్డి జిల్లాలో జోరుగా కురుస్తున్న వర్షాలు

- విత్తనాలు విత్తుకుంటున్న అన్నదాతలు
- ఊపందుకుంటున్న పత్తిసాగు
- వరి, పెసర, మినుము, కంది సాగుకు రైతుల మొగ్గు



సంగారెడ్డి శివారులో విత్తనాలు విత్తుతున్న మహిళా కూలీలు

సంగారెడ్డి జూన్ 13 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో జోరుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు పొలం బాట పట్టారు. సీజన్ ప్రారంభానికి ముందే రైతులు దుక్కులు దున్ని విత్తనాలు విత్తుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు విత్తనాలు విత్తుకోవటం ప్రారంభించారు. ముఖ్యంగా పత్తి రైతులు జోరుగా విత్తనాలు విత్తుకుంటున్నారు. జిల్లాలో వానకాలం సీజన్‌లో అత్యధిక విస్తీర్ణంలో పత్తిపంట సాగు అవుతుంది. ఇప్పటికే 80 వేల ఎకరాల్లో రైతుల పత్తి విత్తనాలు విత్తుకున్నారు. వరి, పెసర, మినుము, కంది పంటల సాగును సైతం రైతులు ప్రారంభించారు. వర్షాలు ఆశించిన స్థాయిలో కురుస్తుండడంతో వానకాలం సీజన్‌లో సాధారణ విస్తీర్ణాన్ని అధిగమించి పంటలు సాగయ్యే అవకాశాలు ఉన్నాయి.

**సీజన్ ఆరంభం నుంచే దంచికొడుతున్న వానలు**

వానకాలం సీజన్‌లో జూన్ రెండోవారం నుంచి వర్షాలు కురవటం, రైతులు విత్తనాలు విత్తుకోవటం ప్రారంభమవుతుంది. అయితే జూన్ మొదటి వారం నుంచే జిల్లాలో వర్షాలు కురవడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. వారం రోజులుగా జిల్లాలో వర్షం జోరుగా కురుస్తున్నది. జిల్లాలో గురువారం వరకు 45.5 మి.మీ. సాధారణ వర్షపాతం కురవాల్సి ఉండగా 86.2 మి.మీటర్ల వర్షం కురిసింది. సాధారణ వర్షపాతం కంటే 89.3 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. 13 రోజుల్లో అత్యధికంగా న్యాల్‌కల్ మండలంలో 13.6 సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది. కందిలో 13.5సెం.మీ., పుల్కల్‌లో 13.2, కల్హేర్‌లో 12.6, నాగల్‌గిద్దలో 12 సెం.మీటర్ల వర్షం కురిసింది. జిన్నారం, ఝరాసంగం, హత్నూర, కొండాపూర్, కోహీర్, రాయికోడ్ మండలాల్లో 10 నుంచి 11 సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది. గురువారం ఒక్కరోజు జిల్లాలో 45.5 మి.మీటర్ల సాధారణ వర్షం కురిసింది. నాగల్‌గిద్ద మండలంలో అత్యధికంగా 51.5 మి.మీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని 16 మండలాల్లో సాధారణం కంటే అత్యధికంగా వర్షపాతం నమోదైంది.

### లక్ష ఎకరాలకు పైగా పంటల సాగు

సంగారెడ్డి జిల్లాలో రైతులు ఇప్పటి వరకు లక్ష ఎకరాల్లో విత్తనాలు వేశారని వ్యవసాయ శాఖ తెలిపింది. వానకాలం సీజన్(2024-25)లో 7,24,405 ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురుస్తుండడంతో పంటల సాగు మొదలైంది. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచారు. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 3.6 లక్షలు కాగా, రైతులు ఇప్పటి వరకు 80వేల ఎకరాల్లో పత్తి విత్తనాలు వేశారు. వర్షాలు కురుస్తున్నందున పత్తి సాగు మరింత ఊపందుకోనుంది. జిల్లాలో ఇప్పటి వరకు 16 ఎకరాల్లో వరి, 10 ఎకరాల్లో మొక్కజొన్న, 547 ఎకరాల్లో కంది, 247 ఎకరాల్లో పెసర, 208 ఎకరాల్లో మినుము, 790 ఎకరాల్లో సోయాబీన్, 656 ఎకరాల్లో చెరుకు పంటలను సాగు చేశారు. దీంతో సాగు విస్తీర్ణం క్రమంగా పెరగనున్నది.



## 'ఓపెన్' పరీక్ష ఫలితాలు విడుదల

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 13: ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించిన ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఎస్ఎస్‌సీ ఫలితాలకు సంబంధించి సంగారెడ్డి జిల్లాలో మొత్తం 2181 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కాగా, 1736 మంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారు. దీంతో 79.60 ఉత్తీర్ణత శాతం నమోదైంది. మెదక్ జిల్లాలో మొత్తం 458 మంది అభ్యర్థులు హాజరు కాగా, 357 మంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారు, 77.95 ఉత్తీర్ణత శాతం నమోదైంది. సిద్దిపేట జిల్లాలో 769 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కాగా, 328 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. దీంతో 42.65 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇంటర్మీడియట్ ఫలితాలకు సంబంధించి సంగారెడ్డి జిల్లాలో మొత్తం 4022 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కాగా, 2696 మంది ఉత్తీర్ణులయ్యారు, దీంతో 67.03 ఉత్తీర్ణత శాతం నమోదైంది. మెదక్ జిల్లాలో మొత్తం 881 మంది అభ్యర్థులు హాజరు కాగా, 530 మంది ఉత్తీర్ణులయ్యారు, 60.16 ఉత్తీర్ణత శాతం నమోదైంది. సిద్దిపేట జిల్లాలో 1057 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కాగా, కేవలం 393 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. దీంతో 37.18 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఆయా ఫలితాలను www.telanganaopenschool.org వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ముద్రించిన మెమోలను 25 రోజుల్లో సంబంధిత అధ్యాయన కేంద్రాలకు అందజేస్తామని తెలిపారు. మెమోల్లో ఏమైనా తప్పులుంటే సవరించేందుకు జూలై 6లోగా తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ సంచాలకులకు సమర్పించాలన్నారు. అభ్యాసకులు రీకౌంటింగ్ కోసం సబ్జెక్టుకు ఎస్ఎస్‌సీకి రూ.350, ఇంటర్మీడియట్‌కు రూ.400 చొప్పున, రీవెరిఫికేషన్ కోసం సబ్జెక్టుకు ఎస్ఎస్‌సీకి రూ.1200, ఇంటర్మీడియట్‌కు రూ.1200 చొప్పున మీసేవ, టీఎస్ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 18 నుంచి 27లోగా చెల్లించాలని సూచించారు. వివరాలకు ఓపెన్ స్కూల్ జిల్లా కోర్డినేటర్ ఎస్.వెంకటస్వామిని 8008403635 నంబరుపై సంప్రదించాలన్నారు.



శివ్వంపేట: లింగోజిగూడలో కూలిన లక్ష్మయ్య పౌల్ట్రీ ఫాం

## దంచికొట్టిన వాన

- ఈదురుగాలుల బీభత్సం, నేలకొరిగిన చెట్లు, కరెంటు స్తంభాలు

సిర్గాపూర్, జూన్ 13: సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలంలో ఈదురుగాలులతో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. మృగశిర కార్తె మొదలుకొని తొలకరి వర్షాలు పడటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కడ్పల్, సుల్తాన్‌బాద్ గ్రామాల్లో ఈదురు గాలుల బీభత్సానికి కరెంటు స్థంబాలు, చెట్టు నేలకొరిగాయని గ్రామస్తులు తెలిపారు. అలాగే రేకులు షెడ్లు ఎగిరిపోయాయని తెలిపారు.

**సబ్‌స్టేషన్‌లో పిడుగు**

పాపన్నపేట, జూన్ 13: మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని రామతీర్థం సబ్‌స్టేషన్‌లో గురువారం పిడుగు పడింది. దీంతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు పగుళ్లు వచ్చి కొంత మేర ఆ లీకేజీ జరిగింది. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలోని మల్లంపేట, రామతీర్థం, ముద్దాపురం, నర్సింగ్‌రావుపల్లి తదతర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. ఇంజినీర్లు వస్తే తప్ప ఎంత నష్టం జరిగిందో చెప్పలేమని సబ్‌స్టేషన్ వర్గాలు వెల్లడించాయి.

**కూలిన పౌల్ట్రీఫాం, రేకుల ఇల్లు**

శివ్వంపేట, జూన్ 13: మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో లింగోజిగూడకు చెందిన దొంతి లక్ష్మయ్య పౌల్ట్రీఫాం కుప్పకూలింది. అందులోని కోళ్లు, కోడిపిల్లలు మృత్యువాత పడ్డాయి. అదేవిధంగా మండలంలోని రూప్లతండా పంచాయతీలోని పోతిరెడ్డిపల్లితండాలో బానవత్ లక్ష్మికి చెందిన రేకుల ఇల్లు ఈదురుగాలులకు ఎగిరిపోయింది. బాధితులు తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



పాపన్నపేట: రామతీర్థం సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీస్తున్న ఏడీఈ

## ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 13: ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. గురువారం టెలికాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అధికారులతో ధరణి పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్డీవోలు, తహసీల్దార్లు వారిస్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని, కలెక్టర్ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారం కోసం మండలస్థాయి అధికారులు గ్రామాల్లో సర్వే చేసి పూర్తి నివేదికను కలెక్టరేట్‌కు సమర్పిస్తే పరిష్కరిస్తామన్నారు. ధరణిలో ఒక్కో మాడ్యూల్‌లో ఉన్న డేటా ఎంట్రీ రోజువారీ లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. ధరణిలో ఎక్కువగా భూమి స్వరూపం మార్పు పేరులో తప్పులు, సర్వే నెంబర్లలో తప్పులు, విస్తీర్ణంలో తప్పులపై వస్తున్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. జిల్లాలో ఎక్కువగా టీం 33కి సంబంధించిన 8 రకాల సమస్యలు తరుచూ వస్తున్నాయని, వీటిపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని సూచించారు.